క్లుప్తంగా

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గుడిబండ: మండల పరిధిలోని జంబులబండ గ్రామ సచివాలయం పరిధిలోని కేకాతి, బూది పల్లి గ్రామాల్లో గురువారం ఉదయం 7 గంటల నుంచి ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ రాధమ్మ తెలిపారు.

సరిహద్దులో చెక్‌పోస్ట్ ఏర్పాటు



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్‌ఐ వెంకటరమణ

రొళ్ల: కర్ణాటక రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో మండల పరిధిలోని కె.బ్యాడిగెర గ్రామ సరిహద్దు ప్రాంతం దగ్గర చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. అక్రమ మద్యం, గుట్కాతో పాటు నిషేధిత వస్తువుల తరలింపుపై ప్రత్యేక నిఘా ఉంచడం కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేకంగా చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని సాయినగర్‌కు చెందిన నాగరాజు అనే వ్యక్తి ఆత్మహత్యకు యత్నించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకునేందుకు యత్నించగా కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నాగరాజు సురక్షితంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్ కుమార్ పేర్కొన్నారు.

నేలకొరిగిన కొబ్బరి చెట్లు

రొళ్ల: మండల పరిధిలోని వన్నారనపల్లిలో మహిళ రైతు కమలమ్మకు చెందిన నాలుగు కొబ్బరి చెట్లు మంగళవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు నేలకొరిగాయి. అధికారులు నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని ఆమె కోరారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు



రహమత్‌పురం పెద్దకాలువ పరిస్థితిని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: మున్సిపాల్టీ పరిధిలోని రహమత్‌పురం ఏరియాల్లోని 15, 16 వార్డుల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ పర్యటించారు. ముఖ్యంగా రహమత్‌పురం ఏరియాల్లో పెద్ద కాలువల్లో మురుగునిలిచిపోయి ప్రజలకు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే శుభ్రం చేయాలని శానిటరీ అధికారులకు సూచించారు. చాలామంది మురుగు కాల్వపైనే అక్రమంగా నిర్మాణాలు చేసుకుంటున్నారని వాటిని తొలగించి మురుగు ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చేయాలన్నారు.

నేడు బసవ జయంతి

లేపాక్షి: లేపాక్షిలోని ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఉదయం 10 గంటలకు బసవ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొండూరు మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు.

గల్లె నిర్మాణానికి భూమి పూజ

అమరాపురం: మండలంలోని హలుకూరు గ్రామ దళిత కాలనీలో కాలనీ వాసులు బుధవారం గల్లె నిర్మాణానికి భూమి పూజ చేశారు. కాలనీలో ఉన్న ప్రతి కుటుంబం గల్లె నిర్మాణానికి ఆర్థిసాయం అందించినట్లు పెద్దలు తెలిపారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

హిందూపురం: విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని వివిధ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్‌సర్కిల్‌లో రాజకీయ పార్టీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు అమానుల్లా, శ్యామ్, బీఎస్పీ శ్రీరాములు, ఎంఐఎం మున్నా పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ మృతి



దేవరాజు(ఫైల్)

రొళ్ల: మండల పరిధిలోని ఆవినకుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ వి.దేవరాజు (62) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. మాజీ మంత్రి రఘువీర, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు దేవరాజు భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు.

జోరుగా ప్రకృతి వ్యవసాయం

రసాయనిక ఎరువులు, మందులకు స్వస్తి చెబుతూ మడకశిర నియోజకవర్గంలోని అధిక శాతం మంది రైతులు ప్రకృతి వ్యవసాయం బాట పట్టారు. ప్రభుత్వమూ ప్రోత్సహిస్తుండటంతో అనుకూలమైన పంటలను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఇప్పటికే 130 గ్రామాల్లో 15,600 మంది సేంద్రియ సేద్యం చేస్తున్నారు.



గుర్రుపుకొండలో రైతు హనుమంతరాయప్ప ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వివిధ రకాల పంటలను సాగు చేసిన దృశ్యం



చిరుధాన్యాల పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు



వక్క తోటలో కనిపిస్తున్న రైతు పేరు నారాయణమూర్తి, గుడిబండ మండలం శంకరగల్లు గ్రామం. ప్రకృతి వ్యవసాయం ద్వారా 2.7 ఎకరాల్లో వక్క తోటను సాగు చేశారు. అందులో అంతర్ పంటగా కూరగాయాలను సాగు చేస్తూ మంచి దిగుబడి సాధిస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు కూడా ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. ఏడాదికి ఖర్చులకు రూ.40 వేలు పోను రూ.2.40 లక్షల ఆదాయం వస్తోందని రైతు నారాయణమూర్తి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- మడకశిర నియోజకర్గంలో 130 గ్రామాల్లో 15,600 మంది రైతులు ప్రకృతి బాట
- జీరో బడ్జెట్‌తో లాభాలబాట
- ప్రభుత్వ ప్రోత్సాహంపై సర్వత్రా హర్షం

మడకశిరరూరల్: మడకశిర నియోజకవర్గంలోని అగళి, మడకశిర, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల్లోని 130 గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా తక్కువ పెట్టుబడితో వివిధ రకాల పంటలను సాగుచేసి అధిక దిగుబడులు పొందుతున్నారు. 2016 సంవత్సరంలో మడకశిర మండలంలో 15 గ్రామాల్లో ప్రారంభమైన సాగు 2023 నాటి రబీకి 130 గ్రామాల్లో 26 వేల ఎకరాలకు విస్తరించింది. 15,600 మంది రైతులు ప్రకృతి వ్యవసాయంలో భాగస్వాములయ్యారు. 147 మంది ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామాల్లో రైతులకు రోజూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో వేరుశనగ, కంది, పూలతోటలు, మొక్కజొన్న, రాగి, కూరగాయాలు, అరటి, వక్క, మామిడి తదితర పంటలను సాగు చేసి అధిక దిగుబడులు పొందుతున్నారు.

ఆర్బీకేల సాయంతో ...

రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో అమలు చేసిన వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల సహకారంతో పంట సాగులో తీసుకోవాల్సిన సూచనలు, సలహాలను రైతులకు అందిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహిస్తోంది. పంట సాగును రైతులను లాభాదాయకంగా మార్చడమే లక్ష్యంగా గ్రామస్థాయిలో సమష్టిగా పని చేస్తున్నారు. పంచాయతీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాల్లో చెత్త సేకరణ ద్వారా తయారు చేసిన సేంద్రియ ఎరువును రాయితీపై రైతులకు అందిస్తున్నారు.

రసాయన ఎరువులకు దూరం

ప్రకృత్రి వ్యవసాయంలో కేవలం సేంద్రియ ఎరువులను మాత్రమే వాడతారు. వివిధ రకాల సేంద్రియ ఎరువులను తయారు చేసుకుని పంటలకు వేస్తారు. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకుండా రైతులు కేవలం సేంద్రియ వ్యవసాయంలో అధిక దిగుబడులను సాధిస్తున్నారు. డ్రై సోయింగ్, పంట మార్పిడి, మల్చింగ్, జీవామృతం, ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను అనుసరిస్తున్నారు.

విదేశీ బృందం పరిశీలన

మడకశిర నియోజకవర్గంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాన్ని, రైతు భరోసా కేంద్రాల పనితీరు, మహిళా సంఘాల సభ్యుల పనితీరులను 15 దేశాలకు చెందిన 30 మంది విదేశీ బృందం సభ్యులు అధ్యయనం చేశారు. ఈ విధానంతో రైతులు సాగు చేసిన పంటలను వారు పరిశీలించారు. పంటలకు తెగుళ్లు సోకవని దిగుబడి కూడా పెరుగుతుందని రైతులు వారికి వివరించారు. దేశంలో మరెక్కడా ఇంత పెద్ద ఎత్తున ప్రకృతి వ్యవసాయం చేయడం లేదన్నారు. రైతుల జీవితాల్లో భారీగా మార్పులు రావడంతో పాటు కాలుష్యం కూడా తగ్గిందన్నారు. పంట సాగుకు ఖర్చు తగ్గడంతో పాటు పంటకు తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉండదన్నారు.

ఆదాయం బాగుంది



బోరు బావి కింద ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ డ్రిప్ ద్వారా నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. రసాయన ఎరువులు, మందులు వాడలేదు. పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వచ్చింది. 50 క్వింటాళ్ల వేరుశనగ కాయలను విక్రయించారు. పంట సాగుకు విత్తనాలు, కూలీలకు పెట్టిన అన్ని రకాల ఖర్చులు పోను రూ. 2.7 లక్షలు ఆదాయం వచ్చిది.

– రవికుమార్, రైతు, తురుకువాండ్లుపల్లి

అన్ని గ్రామాలకూ విస్తరిస్తాం



జిల్లా ప్రకృతి వ్యవసాయం డీపీఎం లక్ష్మానాయక్ ప్రోత్సాహంతో ప్రకృతి వ్యవసాయ విధానాన్ని మడకశిర నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు విస్తరించడానికి చర్యలు తీసుకుంటున్నాం. కరువు రైతులకు ఈ పద్ధతి వరంగా మారింది. తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసుకోవడానికి అవకాశం ఉండటంతో మంచి దిగుబడి కూడా సాధిస్తున్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయ విధానాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలి.

– ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ రమేష్, మడకశిర డివిజన్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



ఆచారిపాళ్యంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

- ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి

గుడిబండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో కుల,మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. మండల పరిధిలోని గుణేమోరుబాగల్ గ్రామ సచివాలయం పరిధిలోని ఆచారిపాళ్యం, హుసేన్‌పురం గ్రామాల్లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిపాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సీఎంగా ఉంటేనే సక్రమంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. టీడీపీ నాయకుల అసత్య ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ప్రజలకు సంక్షేమ పథకాలు దక్కకుండా చంద్రబాబు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, సింగల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, సర్పంచులు యంజారేగౌడు, రంగస్వామి, నాయకులు నాగరాజుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై దాడికి యత్నించడం హేయం



మాట్లాడుతున్న కురుబ, బీసీ సంఘం నాయకులు

పెనుకొండ: బీసీ ఎమ్మెల్యేపై దాడికి ప్రయత్నించడం హేయమైన చర్య అని బీసీ, కురుబ సంఘం నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమానికి వెళుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణపై తన అనుచరులతో సోమందేపల్లి మండలం ఈదులబళాపురానికి చెందిన నాగభూషణ్ రెడ్డి దాడికి యత్నించడంతో పాటు దూషణకు దిగడం సభ్య సమాజం తలదించుకోవాల్సిన విషయమన్నారు. ఒక బీసీ ఎమ్మెల్యేపై ఇలా వ్యవహరించడం ఏ మేరకు సబబో నాగభూషణరెడ్డి ఆలోచించుకోవాలన్నారు. పంచాయతీలో సమస్యలు, అభివృద్ధి విషయంపై మాట్లాడాల్సి ఉంటే నేరుగా ఎమ్మెల్యేతో చర్చించాలేగాని ఇలాంటి చర్యలు దిగడం సరికాదన్నారు. మరోసారి ఇలాంటి వివాదాలకు తావివ్వకూడదని హితవు పలికారు. సమావేశంలో కురుబ సంఘం నాయకులు సోమందేపల్లి మండలం మండ్లి సర్పంచ్ క్రిష్టప్ప, పెనుకొండ మండల అగ్రి కమిటీ చైర్మన్ కొండలరాయుడు, రొద్దం మండలం సానిపల్లి సర్పంచ్ పరమేశ్వరప్ప, పెనుకొండ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రామాంజినేయులు, హనుమంతు, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

జేడీఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

పావగడ: తాలూకాలోని శ్రీరంగపురానికి చెందిన జేడీఎస్ నాయకులు బుధవారం కాంగ్రెస్ అభ్యర్థి హెచ్‌వీ వెంకటేశ్, నాయకుడు ఎగువపల్లి నాని ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రమేశ్, గోపాల్, ఈశ్వరప్ప, మారుతి, వినయ్, నాగేశ్, ఈరముద్దప్ప, కృష్ణప్ప, చిత్తణ్ణ, ఎర్ర ముత్యాలు, ఓబుళేసు, సిద్ధయ్య, తిమ్మయ్య, శివకుమార్, పెద్దన్న, బొమ్మయ్య, కుంటి ముత్యాలు, నాగరాజు, నాగేంద్ర, కరియణ్ణ, బాలప్ప తదితరులు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

జ్యోతుల ఉత్సవం

రొళ్ల: బీజీ హళ్లి, మల్లసముద్రంలో బుధవారం ఘనంగా కొల్హాపురి మహాలక్ష్మీదేవికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు.మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.

గ్రామాల్లో తనిఖీలు నిర్వహించాలి

అమరాపురం: ఉపాధి పథకం కింద గ్రామాల్లో 2022 – 23 సంవత్సరాల్లో జరిగిన పనుల వివరాలను సక్రమంగా తనిఖీ చేయాలని ఎంపీడీఓ మునిస్వామి, ఎస్‌ఆర్‌పీ కాంతయ్య తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు, డీఆర్పీలతో సమావేశమై సూచనలిచ్చారు.

ఊపందుకున్న ప్రచారం



పావగడలో కాంగ్రెస్ అభ్యర్థి వెంకటేష్‌తో కలసి ప్రచారం చేస్తున్న ఆయన సతీమణి శశికళ

పావగడ: పట్టణంలోని పలు వార్డుల్లో జేడీఎస్ నాయకులు బుధవారం జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్ గేజ్ వార్డు లో నారాయణమూర్తి, నంజుండస్వామి, ప్రభు మహలక్ష్మి, శివకుమార్, గేట్ కుమార్, రాజశేఖర్ తదితరులు పాల్గొని జేడీఎస్ అభ్యర్థి తిమ్మరాయప్పను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

బీజేపీ నాయకులు...

స్థానిక బీజేపీ అభ్యర్థి కృష్ణానాయక్ సతీమణి కళావతి బుధవారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాలూకా లోని ఓబుళాపురంలో నిర్వహించిన ప్రచారంలో పాల్గొని కమలం గుర్తుకు ఓటేసి గెలిపించాల్సిందిగా ఓటర్లను అభ్యర్థించారు. మరోవైపు అభ్యర్థి కృష్ణానాయక్ పట్టణంలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



లక్ష్మీవేంకటేశ్వరస్వామివార్ల కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

- కల్యాణం... కమనీయం

హిందూపురం: పట్టణంలోని విద్యానగర్‌లోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్వామివార్ల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణోత్సవాన్ని తిలకించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు, నగరోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఏఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

హిందూపురం టౌన్: ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఎల్‌ఐసీ కార్యాలయ సమీపంలో ఏఐవైఎఫ్ జెండాను నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప, సీపీఐ పట్టణ కార్యదర్శి వినోద్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వే వందశాతం పూర్తి చేయాలి

అమరాపురం: మండలంలో జాతీయ కమ్యూనిటీ అభివృద్ధి సర్వేను వంద శాతం పూర్తి చేయాలని ఆర్‌బీఎస్‌కే , ఎన్‌సీడీ పోగ్రాం అధికారి నివేదిత సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అధికారులతో కలసి తనిఖీ చేశారు.

ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

హిందూపురం టౌన్: విద్యాసంవత్సరం ప్రారంభం కాకుండానే పలు కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు ముందుస్తుగా అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులను కోరారు. బుధవారం పట్టణంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల సమావేశం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బాబావలి , చంద్రశేఖర్, బాబు, నవీన్, సురేష్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేత



బెంగళూరులో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న వలంటీర్

లేపాక్షి: మండలంలోని బిసలమానేపల్లి గ్రామానికి చెందిన వలంటీర్ శైలజ బెంగళూరులోని ఓ ఆస్పత్రికి వెళ్లి బుధవారం వృద్ధాప్య పింఛన్‌ను పంపిణీ చేశారు. బిసలమానేపల్లికి చెందిన దాసప్ప భార్య సరస్వతమ్మ అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పింఛన్ ఇచ్చేందుకు వారి ఇంటికి వెళ్లిన వలంటీర్ విషయం తెలుసుకొని స్వంత ఖర్చుతో బెంగళూరుకు వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. వలంటీర్‌ను గ్రామస్తులు అభినందించారు.



ఉష్ణోగ్రత సమాచారం (గరిష్ఠం)

హిందూపురం	34.0
పెనుకొండ	36.0
మడకశిర	34.0

శుభకార్యం

గోరంట్ల: మండల పరిధిలోని వానవోలు తండాకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సేవే నాయక్ కుమారుని వివాహ వేడుక స్థానిక ఎస్ఎల్‌వీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగింది. ఎమ్మెల్యే శంకరనారాయణ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి ఇంట్లో జరిగిన శుభకార్యంలో పాల్గొని తేనేటి విందు స్వీకరించారు.

రొద్దం: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో బుధవారం జరిగిన ఎంపీపీ చంద్రశేఖర్ కుమార్తె కవిత, మంజునాథ్ వివాహ వేడుకకు ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ, కాంగ్రెస్ మాజీ పీసీసీ అధ్యక్షుడు ఎన్ రఘువీరారెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు.

ఎన్‌సీసీ యూనిట్ మంజూరు

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎన్‌సీసీ యూనిట్ మంజూరైనట్లు కళాశాల ప్రిన్సిపల్ నీలం రమేష్ రెడ్డి బుధవారం తెలిపారు. మొత్తం 102 సీట్లు మంజూరయ్యాయని, డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు మాత్రమే ఎన్‌సీసీలో చేరడానికి అర్హత ఉంటుందన్నారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం

రొళ్ల: మండల పరిధిలోని బీజీ హళ్లి, మల్లసముద్రం గ్రామంలో బుధవారం ఘనంగా కొల్హాపురి మహాలక్ష్మీదేవికి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు.మహిళలు జ్యోతులను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.

సప్లిమెంటరీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

హిందూపురం టౌన్: మండలంలోని సీ.చెర్లోపల్లి ఆదర్శ పాఠశాల, కళాశాలలో అడ్వాన్స్, సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ నాయక్ పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాలలో తరగతులు ప్రారంభమయ్యాయని, ఈ నెల 20వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కొనసాగుతాయన్నారు. ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ



ధ్వజారోహణ నిర్వహిస్తున్న పురోహితులు

మడకశిరరూరల్: పట్టణంలోని కోట వీధిలో వెలసిన లక్ష్మీవెంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కలశ స్థాపన ,అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం శ్రీవారి కళ్యాణోత్సవం, శుక్రవారం స్వామి వారి బ్రహ్మోరథోత్సవం నిర్వహిస్తామని అర్చకులు తెలిపారు.